# ద్రవిడ వర్శిటీలో ఘనంగా అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు

**తేది:04.07.2023**

ద్రావిడ విశ్వవిద్యాలయం హిస్టరీ ఆర్కియాలజీ అండ్ కల్చర్ విభాగం ఆచార్య అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలను వర్శిటీ ఎమెనో హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. వర్శిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వల్లూరు లోకనాథం, ఆచార్య అరవింద్ కుమార్, డా.ఇ.హర్షవర్ధన్‌లు అల్లూరు సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వర్శిటీ రెక్టార్ ఆచార్య టి.అనురాధ, రిజిస్ట్రార్ డా.ఎ.కె.వేణుగోపాల్ రెడ్డిలు ఆయన జయంతి సందర్భంగా స్మరించుకుంటూ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ఆచార్య తుమ్మల రామకృష్ణ మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం సంపాదించిపెట్టాలని ధృడమైన ఆకాంక్షతో వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం భారతీయులుగా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అలాంటి వారిలో మన తెలుగు వారైన అల్లూరు సీతారామరాజు భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి అని అన్నారు. అల్లూరు జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని అన్నారు. సాయుధ పోరాటం ద్వారా స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడని కొనియాడారు. అదేవిధంగా తాను అల్లూరు వారు తిరిగిన అటవీ ప్రాంతాల్లో తిరగడం జరిగిందని తన అనుభవాల్ని పంచుకున్నారు.

డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వల్లూరు లోకనాథం మాట్లాడుతూ... సైన్స్‌పరంగా అల్లూరికి మూలికా శాస్త్రంపై చాలా పట్టుందని తెలిపారు. మూలికా విద్య వలనే అటవీ ప్రాంత ప్రజలకు చాలా దగ్గరయ్యారని అన్నారు. కేవలం 27 ఏళ్ళ వయస్సులోనే నిరక్ష్యరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అనుచరులతో, చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహాశక్తిని ఢీకొన్నారని అన్నారు.

ముఖ్య వక్తగా పాల్గొన్న డా.ఇ.హర్షవర్ధన్ మాట్లాడుతూ... అల్లూరికి మూలికా శాస్త్రం, బంగారు తయారు చేయడంపై చాలా మక్కువ ఉండేదని అన్నారు. ఒక వైపు చదువు, విజ్ఞానం, బ్రిటీష్‌పై వ్యతిరేకవాదం, భారతదేశ పరిస్థితి గురించి, ఉధృతమైనటువంటి జాతీయవాదం ధోరణిపై కూడా ఆయనకు అవగాహన ఉండేదన్నారు. తునిలో వారి నాన్న గారు చనిపోవడం, సంపాదన లేకపోవడం, నర్సీపట్నం వచ్చి చిన్న చిన్న పనులు చేసుకునేవారని అన్నారు. అప్పటికే కాషాయం కడుతారని, కాషాయం కట్టగానే ట్రైబల్స్ అందరూ స్వామి వచ్చారని, కష్టాలు తీరుస్తారని నమ్మారని అన్నారు. అప్పటికే 20 సంవత్సరాలు వయస్సు ఉన్న సీతారామరాజు కంటి ముందే ట్రైబల్స్‌పై జరుగుతున్న అనేక దోపిడీలను ఆయన అడ్డుకున్నారని తెలిపారు. 1918 నుంచి 1920 దాకా ట్రైబల్స్‌లో గడపడం జరిగిందన్నారు. వీరందరికీ బాణాలు వేయడం, తుపాకులు కాల్చడం వంటివి ట్రైనింగ్ ఇచ్చారని.. దీంతో బ్రిటీషు వారు అల్లూరిపై నిఘా పెంచడం జరిగిందన్నారు. 1922 మార్చి, ఏప్రిల్ మాసాల్లో పూర్తిగా బ్రిటీషు వారిపై తిరుగుబాటును ప్రారంభించి.. బ్రిటీషు వారిని ఎదరించడం జరిగిందన్నారు. అయితే అల్లూరి పోలీసు స్టేషన్లపై దాడి చేసి తుపాకులు, సామాగ్రిని ఎత్తుకెళ్ళేవారని.. నిరాయుధాలుగా ఉన్న పోలీసులను ఆయన ఎప్పుడూ చంపలేదని తెలిపారు. అదేవిధంగా పోలీసు స్టేషన్‌లో ఆయన ఆయుధాలు తీసుకెళ్తున్నట్లు రాసి సంతకం చేసేవారని తెలిపారు. దీంతో బ్రిటీషు వారు ఆయుధాలను దాచిపెట్టేవారని అన్నారు. బ్రిటీషు వారిని ఎదిరించలేమని దేశవ్యాప్తంగా అందరి మెదడులో ఉండేదని.. అలాంటప్పుడే అల్లూరు బ్రిటీషు వారు నా ఎడమ కాలి చెప్పుతో సమానమని చెప్పిన ఘనుడని తెలిపారు. 7 మే 1924న అల్లూరు బ్రిటీషు వారికి తాను ఉన్న చోటు తెలిపి చర్చలకు రావాలని పిలిచారని.. అయితే బ్రిటీషు వారు ఏ మాత్రం మాట్లాడకుండా అల్లూరిని చెట్టుకు కట్టి కాల్చేయడం జరిగిందని.. కాల్చేసిన తరువాతనే బ్రిటీషు వారు ఆయన ఫోటోలు తీశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**- డా.ఎమ్.ఎస్.దుర్గాప్రవీణ్, పిఆర్ఓ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం**










126th Jayanthi Celebrations of
Alluri Sitarama Raju
Prof. T. Ramakrishna garu

